అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్ తదితరులు

## అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

వనస్థలిపురం, సెప్టెంబర్ 21: డివిజన్‌లో జరిగే అభివృద్ధిలో ఆయా కాలనీల ప్రజలు భాగస్వాములు కావాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. భాగ్యనగర్ ఫేజ్-1 కాలనీలో రూ.21లక్షలతో సీసీ రోడ్డు, ద్వారకా తిరుమల నగర్, పిండి నారాయణరెడ్డి కాలనీలో రూ.89లక్షలతో ట్రంక్ లైన్ నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామన్నారు. డివిజన్‌లో ఎక్కడ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సాధ్యమైనంత సత్వరమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జంగారెడ్డి, రఘుమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌యాదవ్, మమత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

మహిళా మ్యాక్స్ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు మణెమ్మ, కవిత

కందుకూరు, సెప్టెంబర్ 21: డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మహిళా మ్యాక్స్ అధ్యక్షురాలు చల్లా మణెమ్మ తెలిపారు. కార్యాలయంలో మహిళా మ్యాక్స్ సర్వసభ్య సమావేశాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించిన అనంతరం అధ్యక్షురాలితో పాటు ప్రధాన కార్యదర్శిగా గంగాపురం కవిత, మరో 15 మంది బీఓడీలను ఎన్నుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలని కోరారు. మహిళా మ్యాక్స్‌లో రుణాలు తీసుకున్న గ్రూపులకు ప్రభుత్వం పావలా వడ్డీ చెల్లించడం లేదని.. తక్షణమే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ సహకారాన్ని తీసుకుని సంఘాలు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బీఓడీలు నీలమ్మ, సురుసాని స్వరూప, యశోధ, శివలీల, శ్రీలత, మీనాక్షి, పద్మమ్మ, లక్ష్మమ్మ, జ్యోతి, కళమ్మ, అనిత, భారతమ్మ, అనసూయ, రాజమణి, మేనేజర్ గట్టు రజిత, అకౌంటెంట్ కప్పాటి సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి

● ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బాలాపూర్ చౌరస్తాను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, సెప్టెంబర్ 21: బాలాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, అధికారులతో కలిసి శనివారం బాలాపూర్ చౌరస్తాను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలాపూర్ చౌరస్తాను అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని.. వీధి వ్యాపారుల కోసం మంత్రాల చెరువు వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల్లో వ్యాపారాలు చేసుకోవాలని వారికి సూచించారు. బాలాపూర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. అధికారులు జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, ఆర్డీవో చంద్రశేఖర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తదితరులు ఉన్నారు.

సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసిన పత్రాన్ని చూపుతున్న హైకోర్టు అడ్వొకేట్ కరుణసాగర్

## కఠిన చర్యలు తీసుకోవాలి

సైదాబాద్, సెప్టెంబర్ 21: హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు అడ్వొకేట్ కె.కరుణసాగర్ కోరారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రతను కలుషితం చేసేలా జంతువుల కొవ్వుతో లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయించిన ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, టీటీడీ చైర్మన్, బోర్డు సభ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

## వైద్య శిబిరాన్ని ప్రారంభించిన న్యాయమూర్తి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): జిల్లా న్యాయసేవా సంస్థ, సురక్షా సేవా సంఘం సంయుక్తంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య, రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు పట్టాభిరామారావు, పద్మావతి, ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, న్యాయసేవా సంస్థ కార్యదర్శి శ్రీదేవి, సురక్షా సేవా సంఘం అధ్యక్షుడు గోపి శంకర్, నారి ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కీర్తి యాదవ్, పీవీ నరసింహారావు చారిటిబుల్ ట్రస్ట్ సీఈఓ డాక్టర్ సుధాకిరణ్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## నేడు పల్లకీ శోభాయాత్ర

మన్సూరాబాద్, సెప్టెంబర్ 21: మన్సూరాబాద్ డివిజన్ పరిధి జడ్జెస్‌కాలనీలోని శివాజీ పార్కులో ఆదివారం శ్రీ వసుందర రత్న రాష్ట్రీయ సంత్ సద్గురు డాక్టర్ శివలింగ శివాచార్య మహరాజ్ అహ్మద్‌పూర్‌కర్ పల్లకీ శోభాయాత్రను ఘనంగా నిర్వహించనున్నట్లు వీరశైవ లింగాయత్ అసోసియేషన్ ప్రతినిధులు పాటిల్ మారుతి కసర్లికర్, జి.రాచప్ప తెలిపారు. వీరశైవ లింగాయత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మశ్రీ సోమలింగ శివాచార్య మహరాజ్, బ్రహ్మశ్రీ శివానంద్ శివాచార్య మహరాజ్, బ్రహ్మశ్రీ మల్లికార్జున్ శివాచార్య పాల్గొని ప్రవచనాలు చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా నియమితులైన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం.జి.గోపాల్‌ను శనివారం సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకుడు ఆలూరి, నాయకులు ముంగపతిరావు, వక్కలంక శ్రీనివాస్‌రావు, దడిగం సుధాకర్‌శర్మ, ప్రమోద్ కొటారు, సీతారామయ్య, చిరువోలు మురళి, ధర్మతేజ, సాయిశర్మ తదితరులు ఉన్నారు.

– ఆర్కేపురం, సెప్టెంబర్ 21

బడంగ్‌పేట స్వచ్ఛ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

## బడంగ్‌పేటలో స్వచ్ఛ కార్యక్రమాలు

బడంగ్‌పేట, సెప్టెంబర్ 21: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ రఘుకుమార్, కార్పొరేటర్లు బీమిడి స్వప్నాజంగారెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి తదితరులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బట్టేల్ గుట్టలో చెత్తను తొలగించి.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. రోడ్లపై చెత్త వేయకుండా చెత్త ఆటోల్లో మాత్రమే వేయాలని సూచించారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్య, తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 21: వినాయక నిమజ్జనం కోసం వెళ్తున్న మహిళలను కులం పేరుతో దూషించి దాడులకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్య, తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జి.చెన్నయ్య, బేర బాలకిషన్ మాట్లాడుతూ.. చెరకుతోటలో కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నెల కొల్పిన వినాయకుడిని సరూర్‌నగర్ చెరువులో నిమజ్జనానికి తరలిస్తుండగా అరబిందో కాలేజ్ వద్దకు వెళ్లగానే జక్కిడి రఘువీర్‌రెడ్డి, విజయ్, ప్రతీక్ వారి అనుచరులు దాడులకు పాల్పడి మహిళలను గాయపరిచారని తెలిపారు. మాలలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని దాడులకు పాల్పడిన వ్యక్తులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సదరు వ్యక్తుల చేతిలో గాయపడిన స్వరూపరాణితో పాటు ఇతరులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఖర్చులతో యశోద దవాఖానలో చికిత్స చేయించాలని కోరారు. దోషులను కఠినంగా శిక్షిస్తామని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హామీనిచ్చారని.. కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే తెలంగాణలోని మాల సంఘాలను కలుపుకొని చలో ఎల్బీనగర్‌కు పిలుపునిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూర్గుల వెంకటేశ్వర్లు, గోపగోని రమేశ్, భీమ ముత్యాలు, ఆవుల రమేశ్, యాదగిరి, రేకల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి కాలనీలో యూత్ అసోసియేషన్ గణనాథుని మండపం వద్ద ఏర్పాటు చేసిన 225 కేజీల లడ్డూను లక్కీడ్రాలో దక్కించుకున్న కె.వెంకటరమణ. చిత్రంలో ఉత్సవ నిర్వాహకులు.

– ఎల్బీనగర్, సెప్టెంబర్ 21

కమర్షియల్ టాక్స్ కాలనీ మైసమ్మ దేవాలయం వద్ద రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూను వేలంలో రూ.44వేలకు జె.అఖిల్ యాదవ్ దక్కించుకున్నారు.

– ఎల్బీనగర్, సెప్టెంబర్ 21

## ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వనస్థలిపురం, సెప్టెంబర్ 21 : క్యాన్సర్ చికిత్స ప్రజలందరికి అందుబాటులో ఉండాలని హైదరాబాద్ జిల్లా అడిషనల్ జడ్జి మురళీమోహన్ అన్నారు. ఎల్బీనగర్ చింతలకుంట శ్రీ నిలయంలో మా భూమి సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన శిబిరాన్ని జడ్జి మురళీమోహన్ ప్రారంభించారు. ముందస్తుగా గుర్తిస్తేనే క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. వీఎస్ఎన్ సొసైటీ డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంజీవరావు, పద్మలత, శరణ్య, దివ్య, రాజేశ్వరి, సుధా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్ల ఇంటిగ్రేడెట్ ఎంబీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 21: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన ఐదేళ్ల ఇంటిగ్రేడెట్ ఎంబీఏ పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో ఆరోజు జరగాల్సిన అన్ని పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. ఈ పరీక్షను తిరిగి వచ్చే నెల 16న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష సమయం, పరీక్ష కేంద్రంలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## జైలు అదాలత్‌లో 67 కేసులు పరిష్కారం

నాంపల్లి కోర్టులు, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం చంచల్‌గుడా జైలులో జైలు అదాలత్ ముగిసింది. నాంపల్లి కోర్టులు, సికింద్రాబాద్, మనోరంజన్ కోర్టులకు చెందిన కేసుల్లో అధిక సమయం జైల్లో కొనసాగుతున్న నిందితులపై ఉన్న 67 కేసులను తొలగిస్తూ ఆయా కోర్టులకు చెందిన మెజిస్ట్రేట్లు ఉత్తర్వులు జారీ చేశారు. సీఎమ్ఎమ్, 1,2,3,4,6,7,8,9,14,16,17, 11, 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టుల్లో నమోదైన దొంగతనాలకు చెందిన కేసుల్లో నిందితులుగా ఉన్న రిమాండ్ ఖైదీలు కేసులను ఒప్పుకుంటున్నటు మెజిస్ట్రేట్లకు ప్రకటించడంతో శిక్షలను ఖరారు చేసి రిమాండ్‌లో ఉన్న రోజులను తొలగించి మిగిలిన రోజులను శిక్షలుగా అనుభవించిన తర్వాత నిందితులు నేరుగా జైలునుంచి విడుదలౌతారు. జైలులోనే అదాలత్‌ను నిర్వహించడం ఇది రెండోసారి. ఒక్కొర్కరిపై రెండు కంటె ఎక్కువ కేసులున్న నిందితులకు చెందిన కేసులను సైతం జైలు అదాలత్‌లో తొలగించడం జరిగింది. నాంపల్లి కోర్టుల డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు త్రివిక్రంరెడ్డి, డి.అనంతరఘు, జైలు సిబ్బంది మోహన్, అధికారులు పాల్గొన్నారు.

## దొంగలకు జైలుశిక్ష.. జరిమానా

కాచిగూడ,సెప్టెంబర్ 21: రైల్వేస్టేషన్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ గౌస్‌పాషా 14 నెలల కఠిన కారగారా శిక్ష, రూ.500 జరిమానా విధించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ హయన్(23) ఫలక్‌నుమా-ఉందానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్యలో 2023 నవంబర్ నెలలో వ్యక్తిని అటకాయించి రూ.1500, 3 ఫోన్లను దొంగిలించాడు. అదే సంవత్సరం ఫోన్ దొంగతనం కేసులో మాచర్ల తిమ్మప్ప(23), దుప్పలపూడి సాయి(26) దొంగలకు 6 నెలల కఠిన కారాగారా శిక్షను రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ విధించారు. శనివారం పీపీ సరితారాణి ముగ్గురిని రైల్వే కోర్టులో హాజరుపరచగా కోర్టు శిక్ష విధించినట్లు కాచిగూడ రైల్వే కోర్టు హెడ్‌కానిస్టేబుల్ శ్రీరామ్‌రెడ్డి తెలిపారు.

# మూసిన నాలా.. నిలిచిన వరద

● అధికారుల నిర్లక్ష్యంతో స్థానికుల ఇబ్బందులు ● భారీ వర్షాలు పడితే బాధలు తప్పవా..?

బడంగ్‌పేట ప్రధాన రహదారి పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ వద్ద నాలా మూసుకుపోవడంతో రోడ్లపైకి వస్తున్న వరద నీరు

బడంగ్‌పేట, సెప్టెంబర్ 21: బడంగ్‌పేట ప్రధాన రహదారిపై ఉన్న నాలా మూసుకుపోయింది. దీంతో పై నుంచి వచ్చే వరద వెళ్లేందుకు దారి లేకపోవడంతో రోడ్లపైకి వరద చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ వద్ద నాలా మూసుకుపోవడంతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ''ఈ నాలా గిట్లెట్లా'' పేరుతో గతంలో అనేక కథనాలు ప్రచురించినా.. అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదు. కొన్ని రోజులు మోటార్లు పెట్టి నీటిని తోడేందుకు ప్రయత్నించారు. శుక్రవారం భారీగా వర్షం కురవడంతో రోడ్లపైకి వరద చేరింది. దీంతో రాత్రి సమయంలో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

అంబర్‌పేట/ చిక్కడపల్లి, సెప్టెంబర్21 : తెలంగాణ అస్తిత్వం, ఆత్మ గౌరవ కోసం తన జీవితకాలం పోరాడిన మహానీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. పద్మశాలి ప్రజా సంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో శనివారం మూడు తరాల ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని అశోక్‌నగర్‌లో బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయయకుడు ముఠా జయసింహ, నగర నాయకుడు ఎంఎన్ శ్రీనివాస్ రావు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడ రాజ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, జానకెనడి, అభిషేక్ కెనడి, బాబ్జీ, గుండు జగదీశ్ బాబు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎయిర్‌టెల్ రాజు, పున్న సత్యనారాయణ, బల్లా ప్రశాంత్, అమర్ కుమార్, వంశీ, ప్రభాకర్, బోనం ఉర్మిల, బొట్టు శ్రీనివాస్ భిక్షపతి పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

### బీసీల కోసం విశేషంగా కృషి..

బీసీల కోసం విశేషంగా కృషి చేసిన నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోదుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని ట్యాంక్‌బండ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించారు. బాల్‌రాజ్ గౌడ్, కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్‌లు బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### బాపూజీకి భారతరత్న ప్రకటించాలి..

అంబర్‌పేట : నాటి నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడటమే కాకుండా ఏడవ నిజాం పైన బాంబు దాడి చేసి పోరాట ఉధృత స్వభావాన్ని వ్యక్తపరచిన తెలంగాణ ధీశాలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించాలని అంబర్‌పేట నియోజక వర్గం పద్మశాలి సంఘం నాయకులు కోరారు. నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని శివం రోడ్డులోని న్యూఆజాం కాంప్లెక్స్‌లో గల సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, అధ్యక్షుడు వర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలక శివ్‌కుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్ మాట్లాడుతూ.. మూడు తరాలను ముద్దాడిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. సంఘం ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, గంగిశెట్టి సత్తయ్య, సలహాదారుడు నక్క రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్ పెద్దబొమ్మ మధుసూదన్, తీగల నరేందర్, బాగ్‌అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు కడిగె శ్రీనివాస్, ఇడెం యాదగిరి, మహిళా నాయకురాలు భోగ నీరజ పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీడీఓ బానోతు సరిత

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

కందుకూరు, సెప్టెంబర్ 21: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఎంపీడీఓ బానోతు సరిత తెలిపారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 30మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి.. శనివారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో వారిని శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మనోహర్, పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, యూటీఎఫ్ మండల కార్యదర్శి బుగ్గ రాములు, ఎస్‌టీయూ కార్యదర్శి వెంకటేశం, టస్మ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి రఘురాంరెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఐఈఆర్పిలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన జాతరను విజయవంతం చేయాలి

వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నర్సింహ మాదిగ ఎమ్మార్పీస్ నాయకులు

కందుకూరు, సెప్టెంబర్ 21: అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ జ్ఞాన జాతరను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కందపెద్ద నర్సింహ మాదిగ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్‌ను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ.. మహనీయుల ఆశయ సాధన కోసం అక్టోబర్ 14న కందుకూరు మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జ్ఞాన జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పెద్ద రామయ్య, కొమ్మగాల్ల నర్సింహ, బడ్డోని నర్సింహ, అందుగల కృష్ణ, రాములు, బైండ్ల కృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

## కొత్తగూడ గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ప్రతాపరెడ్డి

కందుకూరు, సెప్టెంబర్ 21: మండల పరిధిలోని కొత్తగూడ గణేశ్ ఉత్సవ సమితి నూతన చైర్మన్‌గా సామ ప్రతాపరెడ్డి ఎన్నికయ్యారు. శనివారం సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌లుగా సొడపు లక్ష్మయ్యగౌడ్, చీమల సురేశ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా బొక్క ప్రభాకర్‌డ్డి, కోశాధికారిగా బొక్క బాల్‌రెడ్డి, సభ్యులుగా తల్లొజు లక్ష్మణాచారి, మక్తాల వెంకటేశ్ గౌడ్, బొక్క శివారెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాద మల్లారెడ్డి, మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బొక్క సత్యనారాయణరెడ్డి, బొక్క భూపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్లు, గుమ్మడి ఎల్లారెడ్డి, సాధ నాగేశ్వర్‌రెడ్డి, బొక్క సంజీవరెడ్డి, సొడపు శేఖర్‌గౌడ్, బొక్క సుధాకర్‌రెడ్డి, సొడపు శంకర్‌గౌడ్, గట్టు కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.